క్లుప్తంగా

సీసీఎంబీ ప్రధాన పరిశోధన సంస్థ

అంబాజీపేట: సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) ఆధునిక జీవశాస్త్రం. సరిహద్దు ప్రాంతాల్లో ప్రధాన పరిశోధన సంస్థ అని దీనిపై ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలని బైరాజు ఫౌండేషన్ సిబ్బంది వివరించారు. రీజినల్ సైన్స్ సెంటర్ (సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం) పర్యవేక్షణలో అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు సంచార వాహనం ద్వారా జన్యుశాస్త్రంపై సోమవారం అవగాహన కల్పించారు. సీసీఎంబీ టీం సభ్యులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో జన్యుపరమైన విజ్ఞానంపై వివరించారు. ఇన్‌చార్జి హెచ్ఎం బీఎస్ఎన్ మూర్తి అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

అంబాజీపేట: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలను గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ సోమవారం నిర్వహించారు. ఈ పోటీలను సీనియర్, జూనియర్ విభాగాల్లో జరిపారు. విజేతలకు ఈ నెల 20న స్థానిక గ్రంథాలయంలో బహుమతులు అందజేస్తారన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై సమాచారం సేకరణ

సఖినేటిపల్లి: మండల పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు సోమవారం వివిధ పాఠశాలలకు వెళ్లి, సంఘ సభ్యత్వ నమోదుతో పాటు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమాచారం సేకరించారు. ఈ మేరకు సంఘ జిల్లా అధ్యక్షుడు దీపాటి సురేష్‌బాబు సదరు సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి వినతి పత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు. నాయకులు పంగం బ్రహ్మాజీరావు, పిల్లి హేమసుందర్ రావ్, అల్లూరు మధువర్మ, కొణతం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కౌలు రైతుల జిల్లా సదస్సు విజయవంతం చేయాలి

మలికిపురం: ఈ నెల 22న సఖినేటిపల్లిలో నిర్వహించనున్న కౌలు రైతుల జిల్లా సదస్సును విజయవంతం చేయాలని సీసీఎఫ్ సొసైటీల సమాఖ్య అధ్యక్షుడు గెద్దం ప్రభాకర్‌రావు కోరారు. సోమవారం అంతర్వేదికరలో సదస్సు విజయవంతం చేయాలని పిలుపునిస్తూ ఒక సమావేశం ఏర్పాటు చేశారు. కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జిల్లా కౌలు రైతుల సదస్సు నిర్వహిస్తున్నట్టు, ఇందులో రాష్ట్ర నాయకులు పాల్గొంటారని ప్రభాకరరావు అన్నారు. రైతు సంఘ నాయకుడు చెల్లుబోయిన కేశవశెట్టి, సీపీఐ నాయకుడు దేవ రాజేంద్రప్రసాద్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ బాటిళ్ల పంపిణీ

ఆలమూరు: మండలంలోని చింతలూరు మండల ప్రజా పరిషత్ ప్రాథమిక (మెయిన్) పాఠశాలలో పాఠశాలలోని విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ సోమవారం జరిగింది. తిరుపతికి చెందిన ఎస్ఐటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కేవీ రామారావు సమకూర్చిన ఈ స్టీల్ వాటర్ బాటిళ్లను మండల విద్యాశాఖాధికారి బి.అప్పాజీ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎంఈఓ అప్పాజీ మాట్లాడుతూ కాలుష్య కారక ప్లాస్టిక్ బాటిల్ కంటే పర్యావరణ సహితమైన స్టెయిన్లెస్ స్టీల్ వాటర్ బాటిల్ వాడడం ఆరోగ్యకరమైందన్నారు. స్టీల్ బాటిళ్లను సమకూర్చిన డాక్టర్ రామారావును అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటేశ్వరరావు, సహ ఉపాధ్యాయుడు వీఎస్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్ర నెట్‌బాల్ సెక్రటరీగా 'పల్లా'



రావులపాలెం: ఆంధ్రప్రదేశ్ నెట్‌బాల్ సెక్రటరీగా పల్లా శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు సోమవారం ఆయన తెలిపారు. ఇటీవల విజయవాడలో ఆంధ్రప్రదేశ్ నెట్‌బాల్ నూతన అసోసియేషన్ ఎన్నిక జరిగిందన్నారు. ఉమ్మడి 13 జిల్లాల ప్రెసిడెంట్, సెక్రటరీలు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. ప్రస్తుతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నెట్‌బాల్ సెక్రటరీ, డాన్ బాస్కో పీఈటీ పల్లా శ్రీనివాసరావును ఆంధ్రప్రదేశ్ నెట్‌బాల్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పల్లా శ్రీనును తూర్పుగోదావరి జిల్లా ప్రెసిడెంట్ కర్రి అశోక రెడ్డి, ప్రిన్సిపాల్ ఐ.బల్తాజార్, తూర్పుగోదావరి జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు, కొత్తపేట జోన్ వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

అయ్యప్పగుడి నిర్మాణానికి భారీ విరాళం



మలికిపురంలో విరాళం చెక్కు అందజేస్తున్న పీఠం అయ్యప్ప భక్తులు

సఖినేటిపల్లి: మండలంలోని మోరి పేరాబత్తుల సుబ్బారాయుడు గురుస్వామి పీఠం ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులు, మలికిపురం ఎత్తు వంతెన వద్ద నిర్మితమవుతున్న అయ్యప్ప స్వామి గుడికి సోమవారం భారీ విరాళం అందజేశారు. ఇటీవల మోరిలో పై పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన 1008 కలశల పూజకి చందాల రూపంలో వచ్చిన మొత్తం నుంచి రూ.8,10,000 నగదును చెక్కు రూపేణా గుడి అభివృద్ధికి గాను, ఏపీ రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జి.పెదకాపుకి అందజేశారు.

అమ్మో.. బొబ్బర్లంక బ్యారేజీ

- ప్రయాణిస్తే ఒళ్లు హూనమే..
- ద్విచక్రవాహన చోదకుల బెంబేలు
- అతుకుల మధ్య రబ్బర్ లేక అవస్థలు



బొబ్బర్లంక బ్యారేజీ వద్ద గ్యాపులు ఉన్న రోడ్డు

ఆత్రేయపురం: రోడ్డు వేశారు.. తారు పూశారు.. బాగానే ఉంది... కానీ అడుగడుగునా స్పీడ్ బ్రేకర్లను తలపించే గతుకులు. బొబ్బర్లంక బ్యారేజీపై తాజాగా రోడ్డు వేశారు. అయితే గతంలో ఉన్న సిమెంట్ రోడ్డు దీని కంటే మేలని వాహన చోదకులు అంటున్నారు. తారు రోడ్డు వేయక ముందు కేవలం సిమెంట్ రోడ్డుపై అక్కడక్కడా గతుకులు ఉండేవని, ఇప్పుడు వేసిన తారు రోడ్డు వలన నడుములు విరిగే పరిస్థితి. ద్విచక్ర వాహనాలకు మరమ్మతులకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. బ్యారేజీపై రోడ్డు వేసే క్రమంలో జాయింట్ల మధ్య రబ్బర్ అమర్చాలి. ప్రతి గేటు వద్ద శ్లాబ్ మధ్య గ్యాప్ ఉంటుంది. అక్కడ ఇనుప డివైడర్ కూడా ఉంటుంది. దానిపై రోడ్డు వేసేటప్పుడు రబ్బరు అమర్చాలి. కానీ రబ్బర్ మాట దేవుడెరుగు జాయింట్ల మధ్య రోడ్డు గ్యాప్ రెండు వైపులా మూడు నుంచి ఐదు అంగుళాల మేర గతుకు ఏర్పడింది. దీంతో ప్రయాణించే ద్విచక్ర వాహనాలు ఎగిరి పడుతున్నారు. ప్రయాణించే వారికి సైతం నడుం పట్టుకుంటున్నారు. పక్కనే ఉన్న ధవళేశ్వరం బ్యారేజీపై ఈ విధమైన ఇబ్బంది లేదు. కానీ బొబ్బర్లంక బ్యారేజీపై ప్రయాణిస్తే మాత్రం ద్విచక్ర వాహనాలు ధ్వంసం అవడంతో పాటు చోదకులకు నడుం విరగడం ఖాయం. కనీసం రోడ్డు నిర్మించేటప్పుడు ఆ కాంట్రాక్టర్ తన ద్విచక్ర వాహనంపై ఒకసారి దానిపై ప్రయాణిస్తే ఆ పరిస్థితి అర్థమయ్యేది. అధికారులు కూడా పట్టించుకోక పోవడంతో ద్విచక్ర వాహన చోదకులు బొబ్బర్లంక బ్యారేజీపై ప్రయాణించాలంటే హడలెత్తిపోతున్నారు. మరోవైపు అరటి రైతులు ఈ బ్యారేజీపై నుంచి సైకిళ్లపై అరటి గెలలను ధవళేశ్వరం మార్కెట్‌కు తీసుకు వెళుతుంటారు. ఈ గతుకుల దెబ్బకి గెలలు సైకిల్ పై నుంచి కింద పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా బ్యారేజీ అధికారులు రోడ్డు అతుకుల మధ్య రబ్బర్ ఏర్పాటు లేదా కనీసం ఆ అతుకులని చదును చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నడుములు విరగడం ఖాయం



మేము బొబ్బర్లంక నుంచి నిత్యం నాలుగైదు సార్లు ఆ బ్యారేజీపై ధవళేశ్వరం వెళుతుంటాం. ఇప్పుడు వేసి తారు రోడ్డు వల్ల అతుకుల మధ్య రోడ్డు మందం ఎక్కువగా ఉంది. వాహనం అదురుకు నడుం నొప్పి వస్తుంది.

– పమ్మి దైవానందం, వాహన చోదకుడు, బొబ్బర్లంక

వాహనాలు షెడ్డుకే..



తారు రోడ్డు వేయక ముందు గోతులు అక్కడక్కడా ఉండేవి. కానీ ఇప్పుడు వేసిన తారు రోడ్డు వలన అడుగడుగునా ఉన్న రోడ్డు అతుకుల మధ్య గ్యాపు ఎక్కువగా ఉంది. మోటారు సైకిల్ ఎగిరి పడుతోంది. షెడ్‌కు పోవడం ఖాయం.

– అడ్డాల నాగన్న, రైతు

ట్రస్టు సేవలు అభినందనీయం



పినపళ్లలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో సేవలు అందిస్తున్న వైద్యులు

ఆలమూరు: ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ) బూసి విద్యాప్రసన్న ఆధ్వర్యంలో నడుపుతున్న ఉమెన్ డెవలప్‌మెంట్ ట్రస్టు సేవలు అభినందనీయమని పినపళ్ల గ్రామస్తులు కొనియాడారు. స్థానిక సంగిత లక్ష్మీకాంతం కల్యాణ మండపంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ సంగిత సుభాష్, ఏఎంసీ మాజీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు ప్రారంభించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరంలోని డెల్టా హాస్పిటల్, శ్రీరమా దంత వైద్యశాల, గౌతమి నేత్రాలయం వైద్యులు విచ్చేసి సుమారు 300 మంది రోగులకు ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేసి వైద్య సేవలను అందజేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన రోగులను తమ సొంత ఆస్పత్రులకు ప్రత్యేక వాహనాల్లో తరలించారు. ఎంపీటీసీ పెదిరెడ్డి పట్టాభి, ఉప సర్పంచ్ యనమదల రాణి, వంటిపల్లి సతీష్‌కుమార్, ఉండమట్ల శ్రీనివాస్, ఇల్లూరి శ్రీనివాస్, ముప్పిరి వెర్రియ్య తదితరులు పాల్గొన్నారు.

ఏజీపీ విద్యా ప్రసన్నకు ఘన సత్కారం

ఏజీపీగా బాధ్యతలు స్వీకరించిన గ్రామానికి చెందిన బూసి విద్యాప్రసన్నకు సర్పంచ్ సంగిత సుభాష్ ఆధ్వర్యంలో ఘన సత్కారం జరిగింది. గ్రామం నుంచి తొలి మహిళ న్యాయవాదిగా గుర్తింపు తెచ్చుకున్న ఆమె విస్తృతంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంపై పలువురు అభినందనలు తెలిపారు. అనంతరం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తులు సమక్షంలో విద్యాప్రసన్న, వెర్రియ్య దంపతులకు శాలువ కప్పి పూలకుండీలు ఇచ్చి ఘనంగా సత్కరించారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో వక్తృత్వ పోటీలు



అంతర్వేదిపాలెంలో గ్రంథాలయ వారోత్సవాల్లో వక్తృత్వ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెం శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సోమవారం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఐదో రోజు ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో 15 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు గ్రంథాలయ నిర్వాహకురాలు వై.వెంకటలక్ష్మి అన్నారు. న్యాయనిర్ణేతగా చింతా శ్యాంబాబు వ్యవహరించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని వెంకటలక్ష్మి అన్నారు. మలికిపురం మండలంలోని కేశనపల్లి శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలను, క్విజ్ పోటీలను ఏర్పాటు చేశారు. వక్తృత్వ పోటీల్లో జూనియర్స్‌కి చదవటం మాకిష్టం అనే అంశంపైన, సీనియర్స్‌కి సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపైన పై పోటీలను గ్రంథాలయ అధికారిణి కె.ఇందిర నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా సతీష్, రామకృష్ణ పాల్గొన్నారు.

బాక్సింగ్ స్టేట్ మీట్‌కు 36 మంది ఎంపిక



పోటీలకు ఎంపికైన క్రీడాకారుల బృందం

మామిడికుదురు: ఎస్‌జీఎఫ్ స్టేట్ మీట్ అండర్–14, 17 పోటీలకు 36 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లంకా జార్జ్ సోమవారం తెలిపారు. మొగలికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో మొగలికుదురులో నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్–14, 17 బాలుర, బాలికల బాక్సింగ్ సెలక్షన్స్ నిర్వహించామన్నారు. ఈ సెలక్షన్స్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులను స్టేట్ మీట్‌కు ఎంపిక చేశామని తెలిపారు. అండర్–14 బాలుర విభాగంలో 13, అండర్–17 బాలుర, బాలికల విభాగాల్లో 23 మంది వెరసి 36 మందిని ఎంపిక చేశామన్నారు. స్టేట్ మీట్ పోటీలు మచిలీపట్నంలో ఈ నెల 19 నుంచి 21 వరకు జరుగుతాయన్నారు. స్టేట్ మీట్‌కు ఎంపికైన క్రీడాకారులు మచిలీపట్నం వెళ్లారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ చిట్టూరి చంద్రశేఖర్, హెచ్ఎం చక్రవర్తి పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకరించాలి



బాల కార్మిక వ్యవస్థపై ఇటుక బట్టీ యజమానులకు వివరిస్తున్న కార్మిక శాఖ అధికారులు

ఆలమూరు: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ సహకరించి నేటి బాలలను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని రాజోలు సహాయ కార్మిక అధికారి కంభంపాటి భాస్కర్ రామాంజనేయశర్మ వ్యాఖ్యానించారు. బాలకార్మిక తనిఖీల్లో భాగంగా మండలంలో ఇటుక బట్టీలు, హోటళ్లు, కిరాణా దుకాణాల్లోను ఇతర పనుల జరిగే ప్రదేశాల్లో సోమవారం బాల కార్మిక శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బాల కార్మికులతో పనిచేయించుకోవడం నేరమని, 18 ఏళ్ల లోపు బాలలను పనిలో పెట్టుకోవద్దని తెలియజేశారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించే విధంగా విద్యాశాఖ కృషి చేయాలన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిబంధనలను అతిక్రమిస్తే యజమానులు శిక్షార్హులవుతారన్నారు. ఐసీడీసీ సీడీపీఓ పి.శారద, సూపర్‌వైజర్ టీఎస్‌వీ నాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న నవీన్‌చంద్ర

మామిడికుదురు: విద్యార్థులు కష్టపడి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మల్లికా మెమోరియల్ ట్రస్టు వ్యవస్థాపకుడు ప్రతాప్‌నేని నవీన్‌చంద్ర సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన సమావేశంలో మండలంలో ప్రతిభావంతులైన 18 మంది విద్యార్థులకు తలా రూ.వెయ్యి నగదుతో పాటు బంగారు పతకాలు అందించారు. 13 జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు మామిడికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులకు వీటిని అందజేశారు. ఎనిమిదేళ్ల నుంచి ఏటా ఈ ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నామని నవీన్‌చంద్ర తెలిపారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



అంతర్వేది ఆలయంలో స్వామి చిత్రపటం అందుకుంటున్న దాత

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం నిత్యాన్నదాన ట్రస్టుకు పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం మండలం రాజుల్లంకకు చెందిన దాత మంతెన రామకృష్ణంరాజు, రాధామాధవి దంపతులు రూ.50,116 విరాళం అందజేశారు. ఈ మేరకు ఆలయంలో సూపరింటెండెంట్ పి.విజయ సారథికి పై మొత్తాన్ని ఇచ్చి, స్వామివారి చిత్రపటం దాత అందుకున్నారు.

స్వామివారి సన్నిధిలో మాజీ ఎమ్మెల్సీ

మాజీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు కుటుంబ సమేతంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం అర్చకులు వారికి ఆశీర్వచనాలు పలికారు. ఆయనకు స్వామి లడ్డు ప్రసాదాన్ని ఆలయ ఏసీ వి.సత్యనారాయణ అందజేశారు. వెంట మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, రాష్ట్ర డ్రెయినేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా లక్షపత్రి పూజ

అంబాజీపేట: పుల్లేటికుర్రు గ్రామంలో వేంచేసిన వ్యాఘ్రేశ్వర స్వామి, మదనగోపాలస్వామి వార్లకు సోమవారం లక్షపత్రి పూజ వైభవంగా నిర్వహించారు. అలాగే బాలాత్రిపుర సుందరి సమేత వ్యాఘ్రేశ్వర స్వామి, వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి, వక్కలంకలో అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి ఆలయంలో పూజలు జరిపారు. స్వామికి రుద్రహోమం, సూర్యనమస్కారాలు, సుందరకాండ పారాయణ తదితర పూజలను వేదపండితుల నడుమ నిర్వహించారు.

విద్యార్థులకు చదరంగం పోటీలు

మామిడికుదురు: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అయిదో రోజు సోమవారం మామిడికుదురు గ్రంథాలయంలో విద్యార్థులకు చదరంగం పోటీలు ఏర్పాటు చేశారు. దీంతో పాటు డిబేట్ కూడా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలకు ఈ నెల 20న ముంగిపు సభలో బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి ఎ.సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎం.శ్రీనివాస్, ఈదరాడ బీడీఎస్ వై.కన్నబాబు, స్థానికులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయాలి

కొత్తపేట: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన కొత్తపేటలో ఎలక్ట్రికల్ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయాలని స్థానికులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో పి.శ్రీకర్ జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు సత్తిరాజు ఆదిత్యకిరణ్, సభ్యులు గుబ్బల మూర్తి, గమిడి శ్రీనివాస్, శ్రీఘాకోళ్లపు భీమేశ్వరరావు తదితరులు వినతిపత్రం సమర్పించారు. ఒకప్పుడు డివిజన్ కార్యాలయం డివిజన్ కేంద్రంలో ఉండాలని అమలాపురం తరలించారు. ఇప్పుడు కొత్తపేట డివిజన్‌గా ఏర్పడడంతో అమలాపురం డివిజన్ కార్యాలయాన్ని విభజించి, కొత్తపేటలో డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయాలని వారు కోరారు. వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 7 అర్జీలు వచ్చినట్టు కార్యాలయం సిబ్బంది తెలిపారు.

'వాక్ ఫర్ బుక్స్' ర్యాలీ

రాజోలు: గ్రంథాలయాలపై విద్యార్థులకు ఆసక్తి పెంచేందుకు రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం 'వాక్ ఫర్ బుక్స్' ర్యాలీ నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని కళాశాల గ్రంథాలయ అధిపతి కె.జగదీష్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షలపై పట్టు సాధించేందుకు గ్రంథాలయాల్లో పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. పీఆర్వో నల్లి రాజు, అధ్యాపకులు శైలజ, మధుకుమార్ పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వృద్ధురాలి మృతి

అయినవిల్లి: మండలంలోని సిరిపల్లి కొండాలమ్మ చింత వద్ద బైక్ ఢీకొని ఓ వృద్ధురాలు ఆదివారం రాత్రి మృతి చెందింది. దీనికి సంబంధించి ఎస్సై మనోహర్ జోషి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం సిరిపల్లి గ్రామానికి చెందిన వనుం నాగరత్నం (80) అదే గ్రామంలోని కొండలమ్మ చింత నుంచి తన ఇంటికి నడుచుకుంటూ వెళుతుంది. అటుగా వస్తున్న ఓ మోటార్ సైక్లిస్టు అతి వేగంగా వచ్చి ఆమెను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో నాగరత్నం తలకు బలమైన గాయమై 108లో అమలాపురంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా నాగరత్నం మృతి చెందింది. దీనిపై మృతురాలు నాగరత్నం కుమారుడు గోపి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సారా విక్రేత అరెస్ట్

ఆలమూరు: జొన్నాడలో అక్రమంగా సారా విక్రయిస్తున్న ఎం.సూర్యకళను స్థానిక ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆలమూరు ఎక్సైజ్ సీఐ ఐడీ నాగేశ్వరరావు కథనం ప్రకారం స్థానిక మెయిన్‌రోడ్డు పక్కన సారా విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎక్సైజ్ సిబ్బంది దాడి చేశారు. ఈ దాడిలో నిందితురాలు సూర్యకళ నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపర్చగా నిందితురాలికి కోర్టు రిమాండ్ విధించింది.

శివ శివ మహాదేవ..

- ఘనంగా మూడో సోమవారం
- శివాలయాలకు పోటెత్తిన భక్తులు



మోరి శివాలయంలో ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కొత్తపేట: కార్తికమాసం మూడవ సోమవారం సందర్భంగా మండలంలో గ్రామ గ్రామాన శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రధానంగా మండలంలోని పలివెలలో పురాణ ప్రసిద్ధి చెందిన ఉమా కొప్పేశ్వర క్షేత్రానికి అత్యధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే స్థానిక, స్థానికేతర ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారికి పూజలు, అభిషేకాలు జరిపించారు. ఆలయ మండపం భక్తుల పూజలతో నిండిపోగా ఉత్తరం వైపు ప్రాంగణంలో పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి దర్శనానికి బారులు తీరారు. పలివెల ఉమా కొప్పేశ్వరస్వామి క్షేత్రంలో కార్తిక సోమవారం అన్నసమారాధనను ఘనంగా నిర్వహించారు. దేవస్థానం సిబ్బంది భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు. మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని భక్తులు దర్శించుకుని అభిషేకాలు జరిపించారు. కొత్తపేట హరిహర దేవాలయం ప్రాంగణంలో రాజరాజేశ్వరి సమేత రాజేశ్వరస్వామి, వాడపాలెం, వానపల్లి, అవిడి, మోడేకుర్రు, గంటి గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: పవిత్ర కార్తిక సోమవారం సందర్భంగా మండలంలోని శైవక్షేత్రాలు భక్తులతో కోలాహలంగా మారాయి. వేకువజామున భారీ సంఖ్యలో భక్తులు శివాలయాలను దర్శించుకుని అభిషేకాలు చేయించుకున్నారు. మొగలికుదురులో కొలువుదీరిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం, పెదపట్నంలంక గ్రామ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉమా సత్యలింగేశ్వరస్వామి ఆలయాల్లో లక్ష బిల్వార్చన ఘనంగా జరిగింది. ఆలయ అర్చకుడు కారుపర్తి సుబ్రహ్మణ్యం, ఆదిరాజు రఘునాథ శర్మ బ్రహ్మత్వంలో బిల్వార్చనలు ఘనంగా జరిగాయి. దీనిలో భాగంగా. విఘ్నేశ్వరపూజ, ఈశ్వరునికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. పార్వతీదేవికి లక్ష కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. హరిహరునికి లక్ష మారేడు దళాలతో అర్చన చేశారు. నీరాజన మంత్రపుష్పం, సూర్య నమస్కారాలు, చండీహోమం, రుద్ర హోమం, తదితర పూజలను ఘనంగా జరిపించారు. పలువురు భక్తులు లక్ష బిల్వార్చనల్లో కర్తలుగా పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

సఖినేటిపల్లి: హరిహరులకు ప్రీతికరమైన కార్తిక మాసంలోని మూడో సోమవారం శైవ, వైష్ణవ పుణ్య క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. సాధారణ భక్తులతో పాటు అయ్యప్పమాల, శివమాల, భవానీమాల, వేంకటేశ్వర స్వామి మాలధారణ భక్తులు పై క్షేత్రాల్లో స్వామివార్లకు పూజలు చేశారు. ఆలయాలు గోవిందా, నమశ్శివాయా అంటూ భక్తుల నామస్మరణలతో మారుమోగాయి. శివాలయాల్లో స్వామికి లక్ష బిల్వ పత్రాలతో పూజలు, ఏకాదశ రుద్రాభిషేకాలు, పార్వతీ దేవికి కుంకుమ పూజలు నిర్వహించారు. అలాగే వైష్ణవ ఆలయాల్లో లక్షతులసి పత్రాలతో పూజలు చేశారు. అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో వేపచెట్టు వద్ద, ప్రధాన గోపురం వెనుకవైపు భక్తులు దీపారాధనలు చేశారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: కార్తిక సోమవారం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున పవిత్ర వశిష్ఠ, వైనతేయ నదీపాయల్లోను, పంట కాలువల్లోను భక్తులు కార్తికదీపాలు వదిలారు. అనంతరం శివాలయాలకు వచ్చి పరమేశ్వరునికి పూజలు చేశారు. స్థానిక గరుడేశ్వరాలయంలో తెల్లవారుజామున రెండు గంటల నుంచి అర్చక స్వామి భైరవభొట్ల సత్యవెంకటనారాయణమూర్తి ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఊడిమూడి, బెల్లంపూడి, నరేంద్రపురం, ముంగండ, ఆర్.ఏనుగుపల్లి, మొండెపులంక, మానేపల్లి తదితర గ్రామాల్లో భక్తులు శివాలయాలకు వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: మండలంలోని ప్రముఖ శివాలయాలు సోమవారం భక్తులతో కిక్కిరిశాయి. వేకువజామునే మహిళలు సమీప పంటకాలువలో పుణ్యస్నానాలు ఆచరించి శివున్ని దర్శించి కార్తికదీపాలు వెలిగించారు. మండలంలోని ముక్తేశ్వరం క్షణముక్తేశ్వరస్వామివారి ఆలయం, అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామివారి ఆలయం, తొత్తరమూడి మూలేశ్వరుని ఆలయం, నేదునూరు కనకదుర్గ చెన్నమల్లేశ్వరస్వామివారి ఆలయం భక్తులతో కిక్కిరిశాయి. సాయంత్రం దీపాలంకరణ చేశారు.

వీరేశ్వరునికి లక్ష బిల్వార్చన

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెంలో కొలువైన వీరేశ్వరస్వామికి సోమవారం లక్షబిల్వార్చన జరిపారు. ముద్రగడ వీరేశ్వరస్వామివారి సత్రం ఆధ్వర్యంలో ఆలయ అర్చకుల పర్యవేక్షణలో వేదపండితులు ఈ పూజలు జరిపారు. స్వామికి విశేష అభిషేకాలు, లక్షబిల్వార్చన పూజలు జరిపారు. సాయంత్రం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



పలివెలలో ఉమాకొప్పేశ్వరునికి అభిషేకం



పి.గన్నవరంలో గరుడేశ్వరస్వామి



మొగలికుదురులో వీరభద్రస్వామికి నిర్వహిస్తున్న అభిషేకం